జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

సోమవారం | 19-08-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 104 పేజీలు: 8 వెల: రూ.7



# మాధురితో.. మాకు ప్రాణహాని

- ✳ మాకు రక్షణ కల్పించండి
- ✳ ఈ ఇంట్లోనే ఉంటాం
- ✳ ఇక్కడ తప్పుడు పనులు జరుగుతున్నాయి
- ✳ నేడు ఎటువంటి డిమాండ్లు చేయలేదు
- ✳ కొత్త ఇంట్లోనే మాధురి ఉంది
- ✳ మాధురి ట్రాప్ నుంచి శ్రీనివాస్ బయటకురావాలి
- ✳ మాధురి, దువ్వాడ అనుచరులతో తమకు ప్రాణహాని
- ✳ మేం పరువు కోసం పోరాడుతున్నాం
- ✳ శ్రీనివాస్‌కు పార్టీ నేతలు నచ్చజెప్పాలి
- ✳ పిల్లల భవిష్యత్ కోసం కలిసే ఉంటాం
- ✳ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ భార్య వాణి

**శ్రీకాకుళం క్రైం/టెక్కలి, ఆగస్టు 18 (వార్త):** దువ్వాడ ఫ్యామిలీ కథా చిత్రం డ్రామా ఆదివారం 11వ రోజుకు చేరింది. అక్కవరంలోని కొత్త ఇంటి వద్ద దువ్వాడ వాణి నిరసన ఆదివారం కూడా కొనసాగింది. వాణి తనను కలిసిన మీడియాతో మాట్లాడుతూ తమ కుటుంబానికి పోలీసులు రక్షణ కల్పించాలన్నారు. శనివారం అర్ధరాత్రి తమ ఇంట్లోకి దివ్వల మాధురి ప్రవేశించినట్లు అనుమానం ఉందన్నారు. ఇక్కడ తప్పుడు పనులు జరుగుతున్నాయని తెలిపారు. తక్షణం తనిఖీ చేయాలని సీఐని కోరామన్నారు. ఇంట్లోకి ఎవరెవరో వచ్చి వెళు తున్నారన్నారు. తాము రాత్రివేళ కొత్త ఇంటి ఆవరణలోని కారు షెడ్‌లో ఉంటున్నామని తెలిపారు. దువ్వాడ అనుచరులు కొందరు బైక్‌లపై వచ్చి రాత్రివేళ ఈ ప్రాంతంలో తిరుగుతున్నారని, వారి వల్ల తమకు ప్రాణహాని ఉందన్నారు. పది రోజులుగా ఆరుబయట ఉండటం వల్ల దుమ్ము, ధూళి, దోమలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. తాను ఆస్తుల కోసమే పోరాటం చేస్తున్నట్లు శ్రీనివాస్ సోదరుడు బాబా ప్రచారం చేస్తుండటం సరికాదన్నారు. తానెప్పుడు దువ్వాడ శ్రీధర్‌తో ఐదు డిమాండ్ల విషయంలో సంప్రదింపులు జరగలేదన్నారు. మాధురి ట్రాప్‌లో దువ్వాడ శ్రీనివాస్ పడ్డారని, ఆమె వల్ల దువ్వాడ శ్రీనివాస్‌కు ప్రాణహాని ఉందన్నారు. శ్రీనివాస్‌కు ఏదైనా జరిగితే తను, తన పిల్లలు వీధిన పడతారన్నారు. పోలీస్ అధికారులు స్పందించి దువ్వాడ శ్రీనివాస్ గృహంలో ఉన్న అనధికార వ్యక్తులను బయటకు పంపించాలని డిమాండ్ చేశారు. శ్రీనివాస్ ఎలా తిరిగిన నాకు అనవసరమని, తమ పిల్లల కోసమే కలిసి ఉంటామన్నారు. తమ పిల్లల భవిష్యత్తు నాకు ముఖ్యం తప్ప రాజకీయ ఆర్థిక ప్రయోజనాలు లేవని తెలిపారు. నాకు ఒక్క రూపాయి కూడా అవసరం లేదన్నారు. కలిసి ఉండడానికి లిఖితపూర్వకంగా హామీ ఇస్తే చాలన్నారు. వైసీపీ అధినేత జగన్‌తో పాటు పార్టీ ముఖ్యులు స్పందించి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కు నచ్చజెప్పాలన్నారు.



## పది రోజులు సోషల్ మీడియాకు దూరంగా ఉంటా: మాధురి

నాకు ఆరోగ్యం బాగా లేదు. బ్రెయిన్ టిష్యూ నుంచి బ్లడ్ వస్తుంది. మరోసారి బ్లడ్ క్లాట్ అయినట్లు అనుమానం ఉంది. వైద్యులకు చూపించాను. రెస్టు తీసుకోమని చెప్పారు. మరో పది రోజులు పాటు సోషల్ మీడియాకు దూరంగా ఉంటాను.

## కృష్ణాష్టమి వేడుకలకు మంత్రి అచ్చెన్నకు ఆహ్వానం

జలుమూరు,ఆగస్టు 18(వార్త): జలుమూరు మండల శివారు గ్రామమైన శ్రీకూర్మంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వేడుకలకు రావాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును ఆ గ్రామస్థులు ఆదివారం ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఆయనకు జ్ఞాపికను అందజేశారు. ఏటా ఆ గ్రామంలో ఈ వేడుకలను నిర్వహిస్తుంటారు. ఈ గ్రామంలో సనాతన సంప్రదాయాలను ఇప్పటికీ పాటిస్తూ, ఆధునిక ప్రపంచానికి దూరంగా ఇక్కడి వారు జీవిస్తున్న సంగతి తెలిసిందే.



# కానరాని ఆహ్లాదం

■ ఆమదాలవలసలో కనుమరుగైన పార్కులు ■ పట్టించుకోని అధికారులు ■ పాలకులు స్పందించాలని ప్రజల వినతి

(ఆమదాలవలస)

ఆమదాలవలస పేరుకే పురపాలక సంఘం.. కానీ ఇక్కడ పట్టణ స్థాయిలో ఎటువంటి సదుపాయాలు లేవు. కనీస అభివృద్ధికి నోచుకోలేదనడానికి ఇక్కడ పార్కులే ఉదాహరణ. ఆమదాలవలసలో ఆహ్లాదకరమైన వాతావరణం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. రోజంతా ఉద్యోగ బాధ్యతలు, విద్యార్థుల





చదువులు, కష్టంతో బతికే వారి పనులు.. ఇలా రోజులన్నీ యాంత్రికంగానే కొనసాగుతుండడంతో వారి మానసిక ఉల్లాసానికి ఎటువంటి సదుపాయాలు లేవని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం సాయంత్రం వేళ సరదాగా ఒక అరగంటో, గంట సేపో కుటుంబసమేతంగా గడిపి పని ఒత్తిడి నుంచి బయట పడి ఆహ్లాదంగా గడుపుదామంటే పార్కులు మూతపడడం బాధాకరమని వారు వాపోతున్నారు.

ప్రధానంగా పట్టణంలోని మోనింగి వారి వీధిలో ఏడేళ్ల క్రితం ఏర్పాటు చేసిన నెహ్రూ చిల్డ్రన్స్ పార్క్, భగత్ సింగ్ కార్ రేసింగ్ పార్కులకు ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. కానీ నిర్వహణ లోపంతో ఏడాదిన్నరలోనే మూతపడ్డాయి. పట్టణంలోని పెద్ద చెరువు ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేస్తామని 15 ఏళ్ల క్రితమే అప్పటి పాలకులు శిలాఫలకం వేసి శంకుస్థాపన చేసారు. కానీ నేటికీ పనులు మొదలు పెట్టలేదు.

ప్రస్తుతం పెద్ద చెరువు సగ భాగం ఆక్రమణకు గురైంది. మిగిలిన భాగంలో సగం గుర్రపుడెక్కతో నిండిపోవడంతో ప్రజల ఆశలన్నీ అడియాశలయ్యాయి. నూతన పార్కులు ఏర్పాటు చేయకపోవడంతో పాటు ఉన్న పార్కులు మరుగున పడడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు.

ఇప్పటికైనా పాలకులు, అధికారులు దీనిపై స్పందించి మూతపడిన పార్కులు తెరిపించడంతో పాటు, నూతనంగా పార్కులు ఏర్పాటు చేసి, వాటిని సక్రమంగా నిర్వహించేందుకు బాధ్యత చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# విద్యతో పాటు నైతిక విలువలు నేర్పాలి




సోంపేట, ఆగస్టు 18(వార్త): మనిషి విజ్ఞానానికి విద్య ఎంత అవసరమో, మానసిక వికాసానికి నైతిక విలువలు కూడా అంతే అవసరమని పలువురు వక్తలు అన్నారు. వి ఫర్ యు ఫౌండేషన్ 16వ వార్షికోత్సవం సోంపేటలోని ఆ సంస్థ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆ సంస్థ అధ్యక్షుడు వూనా శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా శ్రీకాకుళం లాసా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డీఎస్వీ భరద్వాజ్, సీతయ్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు గుల్ల రమేష్, మోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భరద్వాజ్ మాట్లాడుతూ సంస్కారవంతమైన విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందించేందుకు సంస్థ అందిస్తున్న సేవలు ఆదర్శంగా నిలుస్తాయన్నారు. అన్ని సామాజిక సంస్థలు కలిసి పనిచేస్తే మంచి ఫలితాలు పొందవచ్చని సూచించారు. రమేష్ మాట్లాడుతూ సంస్థ అభివృద్ధిలో తాము కూడా తోడ్పాటు అందిస్తామన్నారు. సంస్థ సీనియర్ సభ్యుడు గుంట లచ్చయ్య మాస్టర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నైతిక విలువలు లోపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదర్శవంతమైన విలువలతో కూడిన విద్యా వ్యవస్థ అవసరమని తెలిపారు. అనంతరం గరుడాచలం అప్పలస్వామి తెలుగు భాషాభివృద్ధి పురస్కారం పలాసకు చెందిన తెలుగు పండితుడు కె.అప్పలనాయుడుకు, ముప్పన దండాసి మాస్టారు నిస్వార్థ సేవా పురస్కారం మామిడిపిల్లి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రోణంకి అనంతరావుకు, రాజశేఖర్ అచీవ్‌మెంట్ అవార్డు వివేకానంద గ్రంథాలయంలో చదివి ఉద్యోగాలు సంపాదించిన శాసనపురి నాని, ప్రశాంత్, మాధురి, ధనలక్ష్మి, గణేష్, సతీష్‌కు, యూసీహెచ్ పట్నాయక్ మెమోరియల్ అవార్డు పిల్లి మానసకు అందజేశారు. సోంపేట మండలంలో ఎస్ఎస్‌సీ, ఇంటర్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి ధర్మరాజు, లక్ష్మీనారాయణ పాత్రో, జోగారావు బల్ల బాబూరావు, రాజేష్, అనిల్, కేశవరావు, కృష్ణారావు, శంకర్రావు మాస్టారు తదితర సభ్యులు పాల్గొన్నారు.

## గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గ ఏకగ్రీవ ఎన్నిక

టెక్కలి, ఆగస్టు 18(వార్త): జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులు ఆదివారం టెక్కలిలో సమావేశమయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు చల్లా జగ్గారావు మాట్లాడుతూ పదేళ్లుగా రూ.10వేల జీతాలతో కుటుంబాలు పోషించుకోలేక అనేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. గత ప్రభుత్వం గెస్ట్ ఫ్యాకల్టీలను పట్టించుకోలేదని వాపోయారు. తమ సమస్యల పరిష్కారం ఈ ప్రభుత్వంతోనే సాధ్యపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధాన కార్యదర్శి బడ్డ గణేష్ మాట్లాడుతూ గత దశాబ్దపు కాలముగా జీతాల పెంపునకు నోచుకోని ఏకైక వ్యవస్థ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీ అన్నారు. ఈ ప్రభుత్వం తమ జీతాన్ని రూ.37,000కు పెంచి, ఉద్యోగభద్రత కల్పించాలని కోరారు. సంఘ ఉపాధ్యక్షుడిగా చెక్క రవికుమార్, కోశాధికారిగా చెక్క వసంతరావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా కాకుర్తి నరసింహమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన సభ్యులకు అతిథి అధ్యాపకులు సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా ఉన్న అతిథి అధ్యాపకులు పాల్గొన్నారు.



## నరసన్నపేటలో రైతుబజార్ ఏర్పాటు చేయండి



నరసన్నపేట, ఆగస్టు 18(వార్త): నరసన్నపేటలో రైతుబజారు ఏర్పాటు చేయాలని నరసన్నపేట సిటిజన్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు కోరారు. ఆదివారం వారు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని కలిసి, వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ అధ్యక్షుడు పుచ్చల విశ్వేశ్వరరావు మాట్లాడుతూ సరైన కూరగాయల మార్కెట్ లేకుండా పోయిందని, ఉన్న మార్కెట్ మూలకు చేరిందని వాపోయారు. దీనిపై దృష్టి సారించి, రైతుబజార్ ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో గొద్దు చిట్టిబాబు, మురళీధర్ పాల్గొన్నారు.

## నేడు కిన్నెరవాడలో ఆధ్యాత్మిక సత్సంగం



సారవకోట, ఆగస్టు 18(వార్త): సారవకోట మండలంలోని కిన్నెరవాడ గ్రామంలో గల పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో సోమవారం ఆధ్యాత్మిక సత్సంగం నిర్వహించనున్నట్టు అర్చకులు సిద్దయ్యస్వామి తెలిపారు. పౌర్ణమి పురస్కరించుకొని ఉదయం ఆలయంలో పూజలు, గోమాత పూజ, అనంతరం సత్సంగం నిర్వహిస్తామన్నారు. పలువురు ఆధ్యాత్మిక వక్తలు ఆధ్యాత్మిక ప్రసంగాలు చేయనున్నారన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్న సంతర్పణ చేయనున్నామని తెలిపారు.

## ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్‌కు అవార్డులివ్వాలి



జలుమూరు, ఆగస్టు 18(వార్త) : ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్‌కు టీచర్స్‌డే సందర్భంగా అవార్డులు ఇవ్వాలని ఆ యూనియన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ గంగు మన్మథరావు కోరారు. విద్యా వ్యవస్థలో వంద శాతం ఉత్తీర్ణతకు ప్రైవేట్ టీచర్స్, లెక్చ రర్స్ పాత్ర కీలకమన్నారు. ప్రభుత్వ టీచర్స్, లెక్చరర్స్‌తో పాటు ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ సమష్టి కృషి ఉండడంతోనే విద్యా వ్యవస్థలో సమూల మార్పులు వస్తున్నాయన్నారు. ఆయనతో పాటు జిల్లా అధ్యక్షుడు నాగశివ, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు ఉన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## సేవలకు దూరమైన అంగన్‌వాడీ కేంద్రం

నరసన్నపేట, ఆగస్టు 18(వార్త) : నరసన్నపేటలోని భవానీపురం వీధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం సేవలకు దూరమైంది. 15ఏళ్ల కిందట నిర్మించిన ఈ భవనం నేడు శిథిలావస్థకు చేరుకోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో ఇక్కడి బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు ఈ కేంద్రం ద్వారా సేవలు అందడం లేదు. అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలకు శ్రీకారం చేపట్టినప్పటికీ ఇక్కడ కేంద్రం మాత్రం అభివృద్ధికి నోచుకోవడం లేదు.



## శిథిలావస్థలో తహసీల్దార్ కార్యాలయం



(సారవకోట)

సారవకోటలోని తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరింది. స్లాబ్ పైభాగం పెచ్చులుగా ఊడిపోతూ దిగువ ఉండేవారికి భయాందోళన కలిగిస్తోంది. గోడలు బీటలు వారడం, స్లాబ్ భాగం గజాల తుప్పు పట్టడంతో ఏ క్షణాన కూలిపోతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## ప్రజా ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



గార, ఆగస్టు 18(వార్త): ప్రజా ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. అంపోలు జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం ఓ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని శంకర్ ప్రారంభించి, మాట్లాడారు. ఉచిత వైద్య సేవలను ప్రజలందరూ వినియోగించుకోవాన్నారు. కార్యక్రమంలో గొండు లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ నాయకుడు చంద్రశేఖర్ మృతి



మందస, ఆగస్టు 18 (వార్త): మందస మండలంలోని అంబుగాం గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మజ్జి చంద్రశేఖర్(52) ఆకస్మికంగా మృతి చెందారు. రాజకీయాల్లో చురుకుగా ఉండే ఆయన మరణంపై పార్టీ శ్రేణులు విచారం వ్యక్తం చేశాయి. చంద్రశేఖర్ భార్య లత అంబుగాం సర్పంచ్‌గా పని చేశారు. చంద్రశేఖర్ మృతిపై సర్పంచ్ తిరునగరి వెంకాయమ్మ, సవరయ్య, పార్టీ మండల నాయకులతో పాటు పలువురు సంతాపం తెలిపారు.

## నిలిచిన నాడు-నేడు పనులు



(నరసన్నపేట)

నరసన్నపేట మండలం తామరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పనులలో భాగంగా చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణాలు నిలిచిపోయాయి. ప్రారంభ దశలో నిధులు కొంతమేర విడుదల కావడంతో పనులు ప్రారంభించారు. కానీ పూర్తిస్థాయిలో నిర్మాణాలు జరగకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానిక ఉపాధ్యాయులు తెలిపారు. దీనిపై దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.

# శభాష్..శంకరా..!

- మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే గొండు
- రోడ్డు ప్రమాద బాధితుడిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలింపు

గార, ఆగస్టు 18(వార్త): ఎమ్మెల్యే గొండు శంకర్ మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఆయన అంపోలు నుంచి శ్రీకాకుళం రోడ్డు వైపు కారులో వస్తున్నారు. మార్గమధ్యంలో రోడ్డు ప్రమాదంలో ఓ ద్విచక్ర వాహనదారుడికి గాయాలైన సంగతి తెలుసుకున్న ఆయన వెంటనే కారు దిగి క్షతగాత్రుడిని పరామర్శించారు. అంబులెన్స్‌కు సమాచారం అందజేసి ఆయనను మెరుగైన వైద్య చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. సాటి మనిషి ప్రమాదంలో ఉంటే, వారికి సాయం చేయడానికి ముందుకు వచ్చిన శంకరన్నను పలువురు అభినందించారు. ఇటువంటి ఘటనలతో శంకర్‌కు ప్రజల్లో మరింత ఆదరాభిమానాలు పెరుగుతాయని స్థానికులు చర్చించుకున్నారు.



## 'అడవుల నుంచి ఆదివాసీలను తరిమేసేందుకు కేంద్రం కుట్ర'





పలాస, ఆగస్టు 18(వార్త): అడవుల నుంచి ఆదివాసీలను దూరం చేసే భారీ కుట్ర కేంద్ర ప్రభుత్వం చేస్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలకా చంద్రశేఖర్ ఆరోపించారు.

పలాస మండలం చిన్ననీలావతి గ్రామంలో ఆదివారం ఆదివాసీ పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక సభ జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులు ప్రస్తుతం 20 శాతానికి తగ్గడంతో వాతావరణ సమతుల్యానికి నష్టం జరుగుతుందన్నారు. దీంతోనే వయనాడ్ లాంటి సంఘటనలు జరిగాయని గుర్తు చేశారు. అడవులను రక్షించుకోవాలని ఆదివాసీలకు పిలుపునిచ్చారు. దండకారణ్య దశాబ్దాల విప్లవ ప్రయాణం.. అనేక సామాజిక, సాంస్కృతిక ప్రయోగాలకు నాంది పలికిందన్నారు. అడవుల్లోని ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు కేంద్రం ధారాదత్తం చేస్తోందన్నారు. దీనిని వ్యతిరేకించిన అమాయక ఆదివాసీలను హతమారుస్తున్నారని ఆరోపించారు. డ్రోన్‌లు, హెలికాప్టర్లు, ఉపగ్రహ నిఘాల మద్దతుతో లక్షకు పైగా పారా మిలిటరీ బలగాలతో ఆపరేషన్ కాగర్(ది ఫైనల్ మిషన్).. పేద స్వదేశీ ప్రజలపై దండయాత్రను గుర్తు చేస్తుందన్నారు. ఇది భయంకరమైన, అసాంఘిక యుద్ధమని తెలిపారు.సహజ వనరులను అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తులకు ధారదత్తానికే ఇలా చేస్తున్నారని ఆరోపించారు.

కార్యక్రమంలో జిల్లా హక్కుల సంఘం అధ్యక్షుడు పత్రి దానేశే, పీడీఎస్ రాష్ట్ర అధ్య క్షుడు మద్దిల వినోద్, ఇఫ్టూ జిల్లా నాయకులు జుత్తు వీరాస్వామి, అమరవీరుల బంధుమిత్రుల కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు జోగి కోదండ, పీడీఎఫ్ అధ్యక్షుడు సాలిన వీరాస్వామి, ప్రజానాట్య కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు కొర్రాయ నీలకంఠం, ప్రగతిశీల మహిళా సంఘం అధ్యక్షురాలు బతకల ఈశ్వరి పాల్గొన్నారు.

## మూలనపడ్డ ఎత్తిపోతల పథకం

(జలుమూరు)

టెక్కలిపాడు గ్రామంలో 13 ఏళ్ల క్రితం రైతులకు సాగునీటి కోసం నిర్మించిన ఎత్తిపోతల పథకం నేడు మూలకు చేరింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.ఆనాటి జమ్ము సర్పంచ్ వాన సంధ్య వినతి మేరకు ఆనాటి మంత్రి ధర్మాన ప్రసాదరావు కృషి తో ఈ పథకం మంజూరైంది. ఈ పథకం పరిధిలోని టెక్కలిపాడు, పొన్నాడపేట, చిన్నదూగాం, శివరాంపురం, రావాడపేట, తామరపల్లి గ్రామాల్లో 1250 ఎకరాలకు సాగునీరు అందేది. వర్షాలు లేకపోయినా ఎత్తిపోతల పథకం ధైర్యంతో సాగు సాగించేవారమని పలువు రైతులు స్పష్టం చేశారు. కానీ నేడు ఈ పథకం మూలకు చేరడంతో నష్టపోతున్నామని వారు వాపోయారు. వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్న కింజరాపు అచ్చెన్నాయుడు పరిశీలించి, దీనిని బాగు చేయించాలని వారు కోరారు.



## కూలేందుకు సిద్ధంగా తుఫాన్ భవనం!

(సోంపేట)

సోంపేట మండలంలోని తీర ప్రాంత మత్స్యకార గ్రామమైన ఎర్రముక్కాంలో మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన తుఫాన్ రక్షిత భవనం కూలేందుకు సిద్ధం గా ఉంది. ఈ భవనం పక్కనే ప్రాథమిక పాఠశాల ఉండడం, సముద్రతీరానికి వెళ్లే మార్గం కూడా ఇదే కావడంతో గ్రామస్తులే కాకుండా వివిధ ప్రాంతాలకు చెందిన వారు ఈ మార్గం గుండా రాకపోకలు సాగిస్తు న్నారు. ఈ భవనం దుస్థితి ఇప్పటికే అనేకమార్లు అధి,కారుల దృష్టికి తీసుకువచ్చినా స్పందించడం లేదని గ్రామస్తుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. వెంటనే తొలగించకపోతే ప్రమాదాలు జరిగే అవకా శాలు ఉన్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. భవనం వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డ్‌లు పెట్టి ఏళ్లు గడుస్తున్నా, పంచాయతీ, పాలకవర్గాలు దీనిపై దృష్టి సారించకపోవడం ఏమిటని వారు ప్రశ్నిస్తు న్నారు. అధికారులు వెంటనే స్పందించి ఈ భవనాన్ని తొలగించాలని వారు కోరుతున్నారు. ఈ సమస్య ఇప్పటిదాకా తమ దృష్టికి రాలేదని, వస్తే పరిశీలిస్తామని మండల అధికారులు తెలిపారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం



## పేషెంట్ రిలేషన్ అసోసియేట్‌గా ఉద్యోగావకాశాలు

శ్రీకాకుళం, ఆగస్టు 18(వార్త): ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన వారికి పేషెంట్ రిలేషన్ అసోసియేట్‌గా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్టు బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ ఉద్యోగాల్లో చేరేందుకు తొలుత మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఎచ్చెర్లలోని టీటీడీసీ నందు ఇస్తామన్నారు. శిక్షణ కాలంలో భోజన, వసతి, యూనిఫామ్, మెటీరియల్ వంటి సదుపాయాలు ఉచితంగా కల్పిస్తామన్నారు. ఈ శిక్షణకు 20 నుంచి 30 ఏళ్లలోపు ఉన్న యువతీ, యువకులు అర్హులని, శిక్షణ పూర్తి చేసిన వారికి కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఇంటర్ ఏదైనా గ్రూప్ వారికి డిప్లమో పారా మెడికల్, బైపీసీ పాస్ అయిన వారికి బీఎస్సీ పారామెడికల్ కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. ఆసక్తి గలవారు సెల్ నెంబర్ 9121999654కు ఫోన్ చేసి తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. శ్రీకాకుళం సమీపాన రాగోలు నందు గల జెమ్స్ క్యాంపస్‌లోని తమ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

# మెగా రక్తదానం

- చిరంజీవి పుట్టినరోజు వేడుకల్లో భాగంగా ఎన్‌జీవో హోంలో శిబిరం ఏర్పాటు
- ప్రారంభించిన ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం, ఆగస్టు 18(వార్త): మెగాస్టార్ చిరంజీవి జన్మదినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీకాకుళంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రారంభించారు. చిరంజీవి అభిమానులతో పాటు పవన్ కళ్యాణ్, రామ్‌చరణ్, అల్లు అర్జున్, వరుణ్‌తేజ్, సాయిధరమ్ తేజ్ అభిమానులు పాల్గొని రక్తదానం చేశారు. న్యూ బ్లడ్ బ్యాంక్ మేనేజర్ మణికంఠ ఆధ్వర్యంలోని బృందం రక్తదాతల నుంచి రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఎప్పుడూ ముందు ఉంటారన్నారు. బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుతో మెగాస్టార్ చిరంజీవి సేవా కార్యక్రమాలను నిర్వహించి వాటిని తన అభిమానుల ద్వారా విస్తృతపరిచారన్నారు. రక్తదానం, నేత్రదానంతో ఎంతో మందిని చిరంజీవి ఆదుకోగా, ఆ బాటలో ఆయన అభిమానులు నిలవడం అభినందనీయమన్నారు. రోజుకి ఓ రకమైన సామాజిక సేవా కార్యక్రమం నిర్వహించడం, అందులో తనను భాగస్వామ్యులను చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా అఖిలభారత చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ తైక్వాండో శ్రీను మాట్లాడుతూ చిరంజీవి జన్మదినోత్సవం అంటే తమకి పండుగ అన్నారు. మెగా ఫ్యామిలీ అభిమానుల పేరు చిరస్థాయిగా నిలిచేలా కార్యక్రమాలను జరుపుతున్నామన్నారు. ఈ శిబిరంలో రక్తదానం చేసిన అభిమానులకు, అత్యధిక సార్లు రక్తదానం చేసిన వారికి ఎమ్మెల్యే శంకర్ జ్ఞాపికలను, ప్రశంసాపత్రాలను అందజేశారు. అనంతరం ఆయనను మెగా అభిమానులు సత్కరించారు. కార్యక్రమంలో అఖిలభారత చిరంజీవి యువత ఉత్తరాంధ్ర కార్యదర్శి వైశ్యరాజు మోహన్, బహుజన నేత డా.కంఠ వేణు, వ్యాపారవేత్త బలభద్రుని రాజా, సీనియర్ జర్నలిస్ట్ సుధీర్ వర్మ, న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంక్ మేనేజర్ మణికంఠ, న్యూట్రిషన్ కోచ్ నాగరాజు, వైద్యులు డాక్టర్ బాలానరసింహం, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ ప్రభు, డాక్టర్ రమణ, సాయిబాబా, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ నాగభూషణరావు, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది శివ, సతీష్, రామ్‌చరణ్ యువశక్తి జిల్లా అధ్యక్షుడు మజ్జి గౌతమ్, అల్లు అర్జున్ ఆలిండియా ఫ్యాన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తైక్వాండో నవీన్, గిరి, పవన్‌కళ్యాణ్ ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రతినిధులు కిరణ్ కిర్రు, పెయ్యల చంటి, సాయిధరమ్ తేజ్ యువత అధ్యక్షుడు జోగిపాటి వంశీ, వరుణ్‌తేజ్ ఫ్యాన్స్ అధ్యక్షుడు శీర రాజు, చల్లా అంబేద్కర్ పాల్గొన్నారు.







## శ్రీకాకుళం డీఎస్పీగా వివేకానంద

**శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 18 (వార్త):** రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు అధికారుల బదిలీల పర్వం కొనసాగుతోంది. ఇందులో భాగంగా శ్రీకాకుళం డీఎస్పీగా సీహెచ్ వివేకానందను నియమిస్తూ ఆదివారం డీజీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇక్కడ డీఎస్పీగా ఉన్న వై.శృతికి బదిలీ అయింది. ఆమె స్థానంలో వివేకానందను నియమించారు. విశాఖపట్నంలోని మహిళా పోలీసు స్టేషన్‌లో డీఎస్పీగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీ అయ్యారు. వివేకానంద 1991 ఎస్ఐ బ్యాచ్‌కి చెందినవారు. 2015లో శ్రీకాకుళం స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా విధులు నిర్వహించారు. అలాగే శ్రీకాకుళం స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఏ.త్రినాథరావును విశాఖపట్టణం డీఎస్ఆర్పీ విభాగానికి బదిలీ అయింది.



## నేడు కేంద్రమంత్రి జిల్లా పర్యటన

**శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 18 (వార్త):** కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సోమవారం జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటలకు ఆర్ట్స్ కళాశాల మైదానంలో 11వ జూనియర్ అంతర జిల్లాల సాఫ్ట్–బాల్ పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరవుతారు. మధ్యాహ్నం 12.15 గంటలకు కోటబొమ్మాళి మండలం తాటిపర్తి గ్రామంలో మెండా భాస్కరరావు వర్ధంతి కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం మూడు గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు 80 అడుగుల రోడ్డులోని ప్రజా సదన్ లో సందర్శకులకు అందుబాటులో ఉంటారనీ కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## పగలే వెన్నెలాయే..!

**సోంపేట, ఆగస్టు 18 (వార్త):**

ఏ పంచాయతీ చూసినా ఏమున్నది అన్న చందాన పగలు, రాత్రి అన్న తేడా లేకుండా వెలుగుతున్న వీధి దీపాలు కనిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో రాత్రి వేళల్లో వీధి దీపాలు లేకుంటే పరిస్థితి ఎలా ఉంటుందో ఆయా గ్రామాల పాలకవర్గాలకు తెలియంది కాదు. సోంపేట మండలంలోని అధిక శాతం గ్రామ పంచాయతీల్లో వీది దీపాలు రాత్రి, పగలు వెలుగుతూనే ఉన్నాయి. కానీ స్థానికంగా ఉన్న యువ కులు గానీ, అటుగా వెళ్లేవారు గానీ ఆ స్విచ్‌లు ఆపకపోవడంతో 24 గంటలూ ఆ దీపాలు వెలుగుతూనే కనిపిస్తున్నాయి. ఇది ఏ ఒక్కటో, రెండు రోజులైతే వేరే సాంకేతికపరమైన కారణాలుగా భావించవచ్చు. కానీ చాలా కాలంగా వీధిదీపాలు పగలు కూడా వెలుగుతూ ఉండే పరిస్థితి అనేక గ్రామాల్లో ప్రతిరోజూ కనిపిస్తూనే ఉంది. ప్రభుత్వం నియమించిన సచివాలయాల లైన్ మేన్లు వీధి దీపాలు ఆర్పేందుకు ఓ స్తంభం వద్ద స్విచ్లు ఏర్పాటు చేసినా, పగటిపూట ఆ స్విచ్‌లు ఆపాలనే సామాజిక బాధ్యత ఎవరికీ లేకపోవడం దురదృష్ట కరం. పగలు, రాత్రి లైట్లు వెలగడంతో ఎండ వేడికి ఓ వైపు లైట్లు పాడయ్యే పరిస్థితి ఉండగా, మరోవైపు విద్యుత్ వృథా అవుతుందని, దీన్ని అరికట్టాల్సిన బాధ్యత ఆయా పంచాయతీలపైనే ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు స్పష్టం చేశారు. ఇప్పటికైనా పంచాయతీ పాలకవర్గం స్పందించి, పగటిపూట వీధి దీపాలు వెలగకుండా ఉండేందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఆయా గ్రామాల పెద్దలు కోరుతున్నారు.



### ఆదివాసీ సంక్షేమ పరిషత్
## నూతన కార్యవర్గ ఎన్నిక




బూర్జ, ఆగస్టు 18 (వార్త): బూర్జ మండలం అడ్డూరిపేట గ్రామంలో ఆదివారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి మాట్లాడుతూ బూర్జ మండలంలో 12 గిరిజన గ్రామాలున్నాయన్నారు. బూర్జతో పాటు ఎల్ఎన్ పేట, సరుబుజ్జిలి మండలాల ఆదివాసీ సంక్షేమ పరిషత్ నూతన కార్యవర్గాల ఎన్నిక చేపట్టినట్లు తెలిపారు. ఎన్నికలు జిల్లా అధ్యక్షుడు గురాడ అప్పన్న ఆధ్వర్యంలో జరిగాయి. మండల అధ్యక్షుడిగా సవర శోభన్, ఉపాధ్యక్షులుగా సవర కృష్ణ, కార్యదర్శిగా బాడంగి సురేష్, సహాయక కార్యదర్శిగా సవర ధర్మారావు, కోశాధికారిగా సవర సింహాచలం, సహాయ కోశాధికారిగా సవర లక్ష్మణ్, మహిళా అధ్యక్షురాలిగా కొండ గౌర్రి తేజవతి, మండల సలహాదారుడిగా సవర కుర్మయ్య, కార్యవర్గ సభ్యులుగా 20 మందిని ఎన్నుకున్నారు.

## వర్గీకరణ వద్దు - ఐక్యతే ముద్దు

కొత్తూరు, ఆగస్టు 18 (వార్త): ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ కొత్తూరు ప్రభుత్వ ఉన్నత జూనియర్ కళాశాల ఆవరణలో మండల దళిత నాయకులు సమావేశమయ్యారు. ఈనెల 21న బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా దళిత సోదరులు, కొత్తూరు మండల దళిత నాయకులను కోరారు. వర్గీకరణను సుప్రీంకోర్టు పునః సమీక్షించాలని కోరారు. వర్గీకరణ వద్దు – ఐక్యతే ముద్దు అని నినదించారు. కార్యక్రమంలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు టొంపల తిరుపతిరావు, వడమ శ్రీనివాసరావు, కొర్ర రవి, కింజరాపు సింహాచలం, నాస బాలకృష్ణ, రామకృష్ణ, బొడ్డేపల్లి కృష్ణారావు, విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు, దళిత నాయకులు, దళిత యువత పాల్గొన్నారు.



## పార్టీ శ్రేణులకు అండగా ఉంటా : ఎమ్మెల్సీ నర్తు



సోంపేట, ఆగస్టు 18(వార్త):ఎన్నికల్లో పార్టీ ఓటమి పాలైనప్పటికీ కార్యకర్తలు ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదని, మీకు అండగా అన్ని వేళల్లో అందుబాటులో ఉంటానని శాసనమండలి సభ్యుడు నర్తు రామారావు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఆదివారం సాయంత్రం కవిటి మండలం కొత్తపుట్టుగలో వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన కార్యకర్తల్లో ధైర్యం నింపారు. ఎన్నికల్లో జయాపజయాలు సహజమని, ఈ విషయమై ఎవరూ ఆవేదన చెందాల్సిన పనిలేదన్నారు. రాష్ట్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తు ఉందని, కార్యకర్తలంతా ఉత్సాహంగా ఉండాలని కోరారు. ఎవరికి, ఎప్పుడు, ఎటువంటి సమస్య తలెత్తినా తన వద్దకు రావాలని సూచించారు. ఈ సమావేశంలో మండలానికి చెందిన అనేకమంది పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413